క్లుప్తంగా

వీరభద్రమ్మకు నివాళులు



ఆత్మకూర్ (ఎస్) : వీరభద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్ రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేట జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ తల్లి గోపగాని వీరభద్రమ్మ ఇటీవల మరణించారు. దీంతో ఆదివారం మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో ఆమె సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి శాసనసభ్యుడు గాదరి కుమార్, టీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ



తిరుమలగిరిలో నరేష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దామోదర్ రెడ్డి

తిరుమలగిరి : తిరుమలగిరి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిసోజు నరేష్‌కు ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స జరిగింది. దీంతో ఆదివారం ఆయనను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, వీరారెడ్డి, అనురాధ కిషన్‌రావు, గుడిపాటి నర్సయ్య, చకిలం రాజేశ్వర్ రావు, రాజయ్య, శైలేందర్, అంబేద్కర్, ఎండీ.హఫీజ్, జమ్మి లాల్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

4న సర్వసభ్య సమావేశం

అర్వపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 4న మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సూర్యాపేటటౌన్ : గత 15 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా అభియాన్ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న 22వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కనీస వేతన స్కేల్ ఇప్పించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాంపంగు వెంకటేశ్వర్లు, జలగం లింగయ్య, సైదయ్య, రాంబాబు, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు రెన్యువల్ పనులు ప్రారంభించాలి

అర్వపల్లి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ బీటీ రోడ్డు రెన్యువల్ పనులను వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామసాని రవీందర్ పీఆర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ రోడ్డు బీటీ రెన్యువల్‌కు ఎంఆర్ఆర్ ద్వారా రూ.71లక్షలు మంజూరై రెండేళ్లు కావొస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించడం లేదని చెప్పారు. రోడ్డు రెన్యువల్ కోసం పనులు చేపట్టడానికై టెండర్ ప్రక్రియను కూడా గతంలోనే అధికారులు నిర్వహించారని తెలిపారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు గ్రామప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

పద్మశాలీ సంఘం మండల కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

నాగారం : మండల పరిధిలోని నాగారంబంగ్లాలో పద్మశాలీ సంఘం నూతన మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసునూర్ గ్రామానికి చెందిన వనం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా అవిరేని రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా వనం యాదగిరి, సంయుక్త కార్యదర్శిగా పసునూరి పురుషోత్తం, కోశాధికారిగా తుమ్మ ఆంజనేయులు, యూత్ అధ్యక్షుడిగా వనం వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా కర్నాటి సత్యనారాయణ, యూత్ ప్రధాన కార్యదర్శిగా శీను, కోశాధికారిగా సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్టకొల యుగంధర్, పొన్నం వెంకన్న, పద్మశాలీ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణకు రూ.5కోట్లు

- సూర్యాపేట వేంకటేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ
- రూ.ఐదు కోట్లు ప్రకటించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారి
- తన కుటుంబం తరఫున మరో రూ.40 లక్షలు ప్రకటించిన మంత్రి జగదీష్ రెడ్డి



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రులు, తదితరులు

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో అత్యంత ప్రాశస్త్యం పొందిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. సుమారు రూ.12 కోట్ల అంచనా వ్యయంతో ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అంకురార్పణ చుట్టిన విషయం తెలిసిందే. ఈ పనులకు 2021, ఆగస్టు 23న త్రిదండి చిన జీయర్ స్వామి భూమిపూజ చేశారు. కరోనా మహమ్మారి కారణంగా ఆలస్యం అయిన ఆధునీకరణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. సకల హంగులతో నిర్మించిన బ్రాహ్మణ సదనం ప్రారంభించడానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారిలు ఆదివారం సూర్యాపేట పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్ రెడ్డి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణాచారితో కలిసి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తి వేణుగోపాలాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయం వెనుక భాగంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను మంత్రులు పరిశీలించారు. అక్కడి నుంచి దురాజ్‌పల్లి సమీపంలో రూ 2.50 కోట్లతో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదనం ప్రారంభించేందుకు వెళ్లారు. విప్రహిత బ్రాహ్మణ సదనం ప్రారంభం అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బ్రాహ్మణుల సమక్షంలో వేంకటేశ్వర్ల స్వామి ఆలయ విస్తరణ, అభివద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ రమణాచారి ప్రకటన చేశారు. అలాగే స్థానిక శాసన సభ్యుడిగా వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన కుటుంబం తరఫున రూ.40 లక్షలను మంత్రి జగదీష్ రెడ్డి ప్రకటించారు. దీంతో బ్రాహ్మణులు అంతా కరతాల ధ్వనులతో తమ హర్షం వ్యక్తం చేశారు.



ఆలయ విస్తరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

వ్యవసాయానికి కరెంట్ ఇవ్వడంలో విఫలం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

దురాజ్‌పల్లి : వ్యవసాయానికి సరిపడా విద్యుత్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయానికి సక్రమంగా కరెంట్ రాకపోవడంతో రైతులు వేసిన వరి పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అర్హత లేని బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇవ్వడంలో అర్థం లేదన్నారు. అక్రమార్కులకి పథకాలు ఇస్తే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రైతు రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా నేటికీ పూర్తిస్థాయిలో రైతాంగానికి రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కనికరం చూపడం లేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, ధీరావత్ రవినాయక్, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

అర్వపల్లి : గత వేసవిలో వడగండ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వడగండ్ల కారణంగా జాజిరెడ్డిగూడెం మండలవ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు రూ. 6కోట్ల మేర నష్టపోయారని చెప్పారు. ఆరు నెలలు దాటినా ఇంతవరకు ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు. పరిహారం కోసం అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. అయితే 10 రోజుల్లో పరిహారం చెల్లిస్తామని ఇటీవల డీఏఓ హామీ ఇచ్చినా ఇంతవరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఇప్పటికైనా రెండు రోజుల్లో పంటల నష్ట పరిహారం చెల్లించకపోతే అఖిలపక్షాల ఆధ్వర్యంలో హైవేను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వైశ్య గర్జనకు తరలివెళ్తున్న నాయకులు

భానుపురి : రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ కార్యవర్గ సభ్యుడు ఈగ దయాకర్ గుప్తా, మహాసభ జిల్లా అధ్యక్షుడు మిర్యాల శివకుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైశ్య గర్జనకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యాలయం నుంచి పలువురు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైశ్యులు సైతం గుమాస్తాలుగా పని చేస్తూ, ఆటో నడుపుతూ, వంట పనులు చేసుకుంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ఆర్థికంగా వెనుకబడిన కులాల వారికి ఎన్నో పథకాలు ఇస్తున్నారని వైశ్యులకు సైతం వైశ్య బంధు ఇవ్వాలన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రితో చెప్పి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రయత్నించాలని కోరారు. హైదరాబాద్ తరలివెళ్లిన వారిలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం సురేష్, కోశాధికారి గుడిపాటి రమేష్, సభ్యులు గోపారపు రాజు, బోనగిరి విజయకుమార్, బచ్చు పురుషోత్తం, బెలిదే అంజయ్య, ఓరుగంటి సతీష్, యాద కిరణ్, రాచకొండ శ్రీనివాస్, బుద్ధ శ్రీనివాస్‌గుప్తా కవిత తదితరులు ఉన్నారు.

ప్రమాదాలకు నెలవు.. మూలమలుపులు



అన్నారం శివారులో ఉన్న మూలమలుపు



సంగెం-అన్నారం మధ్య..

- అన్నారం-సంగెం రూట్‌లో ఏడు కిలోమీటర్ల పరిధిలో 30మలుపులు
- కనిపించని హెచ్చరిక బోర్డులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండలం అన్నారం నుంచి సంగెం గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి మూల మలుపులతో ప్రమాదకరంగా మారింది. అన్నారం ఎక్స్‌రోడ్డు నుంచి సంగెం గ్రామానికి మధ్య ఉన్న 7 కిలో మీటర్ల దూరంలో 30 మూల మలుపులు ఉన్నాయి. ఈ మూల మలుపులు చూస్తే పాముమెలికలను, ఎల్, సీ, జెడ్, ఎస్ ఆకారాలను తలపిస్తున్నాయి. ఈ మలుపులు దగ్గర దగ్గరగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఈ దారివెంట రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూల మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. గతంలో ఈ రహదారి వెంట ఆటోలు, బైక్‌లు బోల్తాపడి అనేకమంది గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికై నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మూల మలుపుల వద్ద ప్రమాదాలను నివారించడానికి ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. మూల మలుపులు అధికంగా ఉండటంతో రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలి.

\- బుర్ర శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి, అన్నారం

గృహలక్ష్మి పథకం బూటకం



మాట్లాడుతున్న పటేల్ రమేష్ రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం బూటకమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం కొత్త తండాలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద ఎవరికీ లబ్ధి చేకూర్చలేదని, ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని చెప్పారు. మొదట్లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడు మూడు లక్షలు ఇస్తామని కమీషన్లు తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గెలిస్తే ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని అన్నారు. ఈ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చిలుముల గోపాల్ రెడ్డి, గుగులోత్ భిక్షం, పాండు, నర్సయ్య, జానయ్య, దండ అరవింద్ రెడ్డి, స్వామి నాయుడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ శోభాయాత్ర

నాగారం : నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లాలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గణేశ్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహానికి గ్రామంలోని వీధుల్లో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని గ్రామంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

వయో వృద్ధులకు సముచిత స్థానం కల్పించాలి



నూతనకల్ : వయోవృద్ధులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, తదితరులు



తుంగతుర్తి : తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దార్

నూతనకల్ : సమాజంలో వయోవృద్ధులకు సముచితస్థానం కల్పించి వారిని గౌరవించాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో వయోవృద్ధులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వయోవృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి

తుంగతుర్తి : సమాజంలో ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులను శాలువాలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. వృద్ధుల పట్ల వారి కుమారులు నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. వృద్ధులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు రాకున్నా, వారు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ అల్లావుద్దీన్, ఓరుగంటి సత్యనారాయణ, సంతోష్, సత్యనారాయణ, సోమయ్య, వెంకన్న, మహేష్, వృద్ధులు పాల్గొన్నారు.

గాంధీజీకి మనమిచ్చే నివాళి పరిశుభ్రతే..



సూర్యాపేట టౌన్ : గాంధీజీ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



తిరుమలగిరిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

సూర్యాపేటటౌన్ : మహాత్మా గాంధీకి మనమిచ్చే నిజమైన నివాళి పరిశుభ్రతేనని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకటేషులు అన్నారు. 1వ తేదీ ఒక గంట స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణంలోని తెలంగాణ తల్లి, గాంధీజీ, జగ్జీవన్ రావు, ఆకారపు సుదర్శన్, సంతోష్‌బాబు విగ్రహాలతో పాటు మినీ ట్యాంక్‌బండ్ ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. విద్యార్థులు, యువత గాంధీజీ సిద్ధాంతాలను పాటించాలన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణంలోని 4వ వార్డులో కంపచెట్లను, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. దుర్గంధం రాకుండా బ్లీచింగ్ చేశారు. పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చైర్మన్ పోతరాజు రజిని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, కౌన్సిలర్ బత్తుల శ్రీనివాస్, కందుకూరి లక్ష్మయ్య, ఖదీర్, అఖిల, పరశురాం పాల్గొన్నారు.



అర్వపల్లి : లోయపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని లోయపల్లి సర్పంచ్ గాదరి శాంతమ్మ కోరారు. మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు వీధులు, మురుగు కాలువలు శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో మహిళలు ర్యాలీ జరిపి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భద్రమ్మ, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



మద్దిరాల : మాట్లాడుతున్న సర్పంచ్ ఇంతియాజ్‌ఖాతూన్, తదితరులు

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

మద్దిరాల : స్వచ్ఛతతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సర్పంచ్ షేక్ ఇంతియాజ్‌ఖాతూన్ రజాక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలోని పలు వీధులను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కారదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తుంగతుర్తిలో మాట్లాడుతున్న సత్యనారాయణ

తుంగతుర్తి : కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ బాధ్యుడు గౌడిచర్ల సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత పాలకులు కార్మిక రంగాన్ని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు, డ్రైవర్లకు ఇన్సూరెన్సు అందజేస్తున్న ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కేవీ నాయకులు కూరపాటి సోమేష్, గడ్డం సోమేష్, బొంకురి శ్రీను, కోడిదల వెంకన్న, రాములు, రాజీవ్, రామచంద్రు, వీరాస్వామి, ముత్తయ్య, రమణమ్మ, సాయమ్మ, జయమ్మ, ఈరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను విజయవంతం చేయాలి

తిరుమలగిరి : ఈ నెల 3న నేరేడుచర్లలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు ఎండీ.ఫయాజ్‌మియా కోరారు. ఆదివారం తిరుమలగిరిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఆయూబ్, పురుషోత్తం, షరీఫ్, కొమురెల్లి, అశోక్, యాకస్వామి ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

పెన్‌పహాడ్ : మాచారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాలయ నిర్మాణానికి మాచారం ఆవాసం అనిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముదిరెడ్డి రంగారెడ్డి-లలితమ్మ దంపతులు రూ. లక్ష 116ల విరాళాన్ని ఆదివారం దేవాలయ కమిటీ చైర్మన్ బొల్లక బొబ్బయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పల్లె సైదులు, వీరబోయిన సైదులు, బొల్లక సోమయ్య, దూబని దేవయ్య, బొల్లక కొ మ్ములయ్య, కొరివి బొబ్బయ్య, అంజయ్య, ఉప్పుల సైదులు, గణేష్, దేశగాని జానయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిషోర్ గెలుపునకు కృషి చేయాలి

మద్దిరాల : ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ గెలుపునకు యువత కృషి చేయాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని అన్నారు. కార్యక్రమంలో వడ్డాణం మధుసూదన్, వల్లపు రమేష్, వెంకట్‌రెడ్డి, మల్యాల నర్సయ్య, బీఎస్.ముదిరాజ్, రాములు, కొలగాని వెంకన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నూతనకల్ : మండల పరిధిలోని వెంకెపల్లిలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సర్పంచ్ మాతంగి సోమనర్సమ్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలోని అన్ని వీధులను సీసీ రోడ్లుగా మార్చేందుకు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలుగౌడ్, వార్డు మెంబర్ మిర్యాల అంబేద్కర్, కుంట మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

4న గౌడ జన ఆత్మీయ సమ్మేళనం

నూతనకల్ : ఈ నెల 4న సూర్యాపేటలో నిర్వహించే గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చిత్తలూరి నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్నగౌడ్, జక్కి పరమేష్, మారగాని మారయ్య, మొగుళ్ల వెంకన్న, బత్తిని లింగయ్య, పులుసు వెంకన్న, రేసు విజయ్, కప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుమలగిరిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మారెడ్డి, ఎస్.రాంరెడ్డి, రహమాన్ అలీ, రామచంద్రయ్య, అంజయ్య, కొమురెల్లి, వెంకటనర్సయ్య, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, యాదగిరి, సుధీర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుమలగిరి : ఈ నెల 6, 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాలు కోరారు. ఆదివారం తిరుమలగిరిలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యాదగిరి, జిల్లా కోశాధికారి లాలు, నగేష్, వేణు, నరేష్, శ్యామ్, రమేష్, శ్రీనివాస్, కిష్టునాయక్, సుధీర్, భాస్కర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ఈ నెల 6, 7, 8 తేదీలలో మూడురోజుల పాటు హైదరాబాద్ వేదికగా జరుగనున్న ఫొటో ఎక్స్‌పో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్లు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటోఎక్స్‌పో కమిటీ జిల్లా అధ్యక్షుడు కుకుంట్ల లాలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరి యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి జె.అశోక్, మహేష్, నగేష్, వెంకన్న, ప్రభాకర్, సంపత్, యాకన్న, ఆనంద్ పాల్గొన్నారు.